# 'ప్రత్యేక హోదా' పై
# స్వరంమార్చిన రాష్ట్ర పాలకులు

**విభజిత** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేకహోదా తీసుకువస్తామని రాష్ట్రంలోని తెలుగుదేశం పాలకులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేకహోదా కల్పిస్తామని కేంద్రంలోని బిజెపి నాయకులూ గత రెండు సంవత్సరాలుగా ఊదరగొడుతూ వచ్చారు. విభజన సమయంలో పార్లమెంటులో చర్చ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఐదు సం॥లు ప్రత్యేకహోదానిస్తామని నాటి ప్రధానమంత్రి ప్రకటనచేస్తే, 'కాదు... పది సంవత్సరాలు ప్రత్యేకహోదా కావాల'ని డిమాండ్ చేసిన నాటి బిజెపి నేతలు, తరువాత అధికారంలోకి వచ్చేది తామే గనుక, తాము ఈ హోదాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కల్పిస్తామని బహిరంగ ప్రకటనలు చేశారు. వారి ఎన్నికల వాగ్దానాలలోనూ పేర్కొన్నారు. రాష్ట్రాన్ని హడావుడిగా విభజనచేసిన కాంగ్రెస్ నాయకత్వంలోని యుపిఏ సర్కారు, ప్రత్యేక హోదా అంశం చేర్చకుండానే రాష్ట్ర విభజన చట్టాన్ని రూపొందించి, అమలుచేసి, రెండు రాష్ట్రాల నేర్పరచి, రెండేళ్ళు గడిచింది.

రాష్ట్ర విభజన నాటి నుండి పాలకులు నదీజలాల తగవులు, ఆస్తులు-అప్పుల అంపకాలు, పోలవరం ముంపుగ్రామాలు, వృత్తివిద్యార్థుల పరీక్షల నిర్వహణ, హైకోర్టు వివాదంవంటి అనేక అంశాలతో నిరంతరం ఇరు రాష్ట్రాల మధ్య రావణకాష్టాన్ని రగుల్చుతూనే వస్తున్నారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వంకానీ, రెండు రాష్ట్రాలకు ఆనాటి నుండి కొనసాగుతున్న ఒకే ఒక గవర్నర్‌గానీ, ఈ సమస్యలను వేటినీ పరస్పర చర్చల ద్వారా పరిష్కరించకుండా నానుస్తూ వస్తున్నారు. తద్వారా ఇరురాష్ట్రాల ప్రజల మధ్య నిరంతర విద్వేషాలను రగిలిస్తూ చోద్యం చూస్తున్నారు.

కొన్ని వెనుకబడిన ప్రాంతాలను త్వరితంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో ప్రణాళికా సంఘం జనాభా, తలసరి ఆదాయం, ఆ రాష్ట్ర ప్రత్యేక సమస్యలు ఆధారంగా ప్రత్యేక హోదా యిచ్చే రాష్ట్రాలను ఎంపిక చేసేది. నాల్గవ పంచవర్ష ప్రణాళికా కాలంలో ప్రత్యేక హోదాను అస్సాం, నాగాలాండ్, జమ్మూకాశ్మీర్ రాష్ట్రాలకు యిచ్చారు. తరువాత ఈశాన్య భారతంలో కొత్త రాష్ట్రాలు ఏర్పడ్డాయి. దీనితో ఐదవ పంచవర్ష ప్రణాళికా కాలంలో ఏడు ఈశాన్య రాష్ట్రాలకూ, సిక్కిం, హిమాచల్‌ప్రదేశ్‌లకు ప్రత్యేక హోదాను యిచ్చారు.

ప్రత్యేక హోదా యిచ్చిన రాష్ట్రాలకు కల్పించే సౌకర్యాలేమిటి? ప్రణాళికా సంఘం పంచవర్ష ప్రణాళికకు కేటాయించే నిధులలో 30 శాతం ప్రత్యేక హోదా యిచ్చిన రాష్ట్రాలకు అందచేయాలి. రాష్ట్రాల ప్రణాళికలకు ప్రణాళికా సంఘం సమకూర్చే నిధులలో 30 శాతం గ్రాంటుగానూ (తిరిగి చెల్లించనవసరంలేదు) 70 శాతం రుణంగానూ అందచేస్తుంది. కాగా ప్రత్యేక హోదా కలిగిన రాష్ట్రాలకు 70 శాతం గ్రాంటుగానూ, 30 శాతం రుణంగానూ అందచేస్తుంది. ప్రత్యేకహోదా వల్ల పొందే ఏకైక సౌకర్యం ఇది. 2001 నుండి 10 ఏళ్ళపాటు ఆదాయ పన్ను నుండీ, కేంద్ర ఎక్సైజ్ సుంకం నుండీ 100 శాతం మినహాయింపును ప్రత్యేకహోదా గల రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం యిచ్చింది. అది కేంద్రం తీసుకున్న నిర్ణయం. ఈ రాయితీకావాలని ఏ రాష్ట్రమైనా కేంద్రాన్ని అడగవచ్చు. కేంద్రం యివ్వవచ్చు. ప్రత్యేకహోదాతో ఇది ఆటోమాటిక్‌గా రాదు.

నరేంద్రమోడీ ప్రభుత్వం ప్రణాళికా సంఘాన్ని రద్దుచేసింది. కనుక ఇప్పుడు రాష్ట్రాలకు ప్రణాళికా సంఘం నిధులు కేటాయించటమన్న అంశమే లేదు. నీతి ఆయోగ్ చేసే పనేమిటో ఇంకా స్పష్టత ఏర్పడలేదు. కానీ రాష్ట్రాల ప్రణాళికలకు నిధులు కేటాయించే పనిమాత్రం అది చేయదు. దీనికితోడు 14వ ఆర్థిక సంఘం కేంద్ర నిధుల నుండి రాష్ట్రాలకు పంపకం చేయాల్సిన భాగాన్ని 32 శాతం నుండి 42 శాతానికి పెంచింది. ప్రత్యేక హోదా యిప్పటికే యిచ్చిన రాష్ట్రాలకు అదనపు నిధులు ఎలా సమకూరుస్తారో స్పష్టం చేయలేదు.

నిన్న మొన్నటిదాకా ప్రత్యేకహోదా సాధిస్తామంటూ పలికిన తెలుగుదేశం పాలకులు, ప్రత్యేకహోదా కల్పిస్తామంటూ బీరాలు పలికిన బిజెపి పాలకులూ – ఎట్టకేలకూ ప్రత్యేకహోదా సాధ్యంకాదని చేతులెత్తేసి, వెనువెంటనే 'హోదా'పై వారి బాణీని మార్చివేశారు. 'ప్రత్యేకహోదా' ఇస్తే, అలా హోదా ఇచ్చిన రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ కూడా ఒకటి అవుతుంది తప్ప, ప్రత్యేక హోదా వలన అదనంగా ఒనగూడే ప్రయోజనమేమీలేదని ప్రకటించి, నిన్నటిదాకా తాము చెప్పిన 'ప్రత్యేకహోదానే సర్వస్వమన్న' దానికి పూర్తి విరుద్ధంగా మాట్లాడుతున్నారు. హోదాకు మించిన ప్యాకేజీని రాష్ట్రానికి కేంద్రం దయతలచినందున దానితో సంతసించాలని, ఒకవిధంగా ఈ 'ప్యాకేజీ'నే హోదాకంటే మెరుగనేవైపుగా ప్రసారమాధ్యమాలలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే పరమావధిగా తాము పనిచేస్తున్నామని, హోదాకంటే ప్యాకేజీనే రాష్ట్ర ప్రజలకు లాభదాయకమని భావిస్తున్నామని నిన్నవరకూ 'హోదాపై తేల్చుకుంటాం' అని మాట్లాడిన తెలుగుదేశం నేతలు స్వరం మార్చారు.

వామపక్షాలతో సహా వైయస్సార్‌సిపి, కాంగ్రెస్ తదితర పార్టీలన్నీ 'ప్రత్యేకహోదా'కు కేంద్రం అంగీకరించక పోవటం, ప్యాకేజీతో తెలుగుదేశం ప్రభుత్వం సంతృప్తిపడటాన్ని 'ఓటుకునోటు కేసు'కు జంకి కేంద్రానికి లొంగుబాటుగా, ఆంధ్ర ప్రజల ఆత్మాభిమానాన్ని దెబ్బతీయటంగా ప్రచార ఆందోళనల పర్వాన్ని ఉధృతం చేశాయి. ప్రత్యేకహోదా కోల్పోవటంతో ఆంధ్రప్రదేశ్ అంధకారమయమవుతుందనే దగ్గర నుండి, 2019 ఎన్నికలలో 'ప్రత్యేకహోదా'కు సమ్మతించే పార్టీకే కేంద్రంలో తమ మద్దతు

కొనసాగుతుందనేవరకు వైయస్సార్ కాంగ్రెస్ మాట్లాడుతోంది. 14వ వేతన సంఘం 'ప్రత్యేకహోదా' ఇవ్వవద్దని చెప్పటాన్ని సవాల్ చేయటం నుండి, కొందరు వామపక్ష పార్టీల నాయకులు – ప్రత్యేకహోదా ఇప్పటికే కల్పించిన రాష్ట్రాలలో పర్యటించి రావటానికి (జరిగిన 'అభివృద్ధి'ని తెలుసుకోవటానికి) సిద్ధమేనా? అని తెలుగుదేశం నాయకులకు సవాల్ విసురుతున్నారు.

ఏతావాతా – ప్రజలంతా మరికొంతకాలం 'ప్రత్యేకహోదా' చుట్టూ తిరిగేవిధంగా పాలక, ప్రతిపక్ష పార్టీల వాదనలతో ప్రతిరోజూ దినపత్రికలు వార్తలు నింపుకొస్తున్నాయి. ప్రత్యేకహోదా వస్తే, పారిశ్రామిక వర్గాలకు పన్ను మినహాయింపులతో సహా, బోలెడన్ని రాయితీలు కల్పించబడతాయి కావున
ప్రత్యేకహోదాతో రాష్ట్రం పారిశ్రామికంగా అభివృద్ధి సాధిస్తుందని, తదనుగుణంగా ఉద్యోగావకాశాలు మెరుగవుతాయని ప్రత్యేకహోదా సమర్ధకులు వాదిస్తూ వుండగా, ప్రత్యేక హోదాలో కల్పించే రాయితీలకు మించి ఇవ్వటానికి కేంద్రం సంసిద్ధతను వ్యక్తం చేసింది కనుక, ఆ హామీలకు చట్టబద్ధత కల్పిస్తే సరిపోతుందని బాణీమార్చిన తెలుగుదేశం నేతలు వక్కాణిస్తున్నారు. నిన్నటివరకూ 'ప్రత్యేక హోదా' గురించి మాట్లాడి, ఈరోజు ప్లేటు ఫిరాయిస్తున్నారని తెలుగుదేశాన్ని ఓ మూలకు నెట్టి తద్వారా రాజకీయ లబ్ధి పొందాలనే ఆతృతతో ప్రతిపక్ష పార్టీలున్నాయి.

వాస్తవానికి, ప్రత్యేకహోదా వున్నా, లేకున్నా బడాపారిశ్రామికవేత్తలకు రాయితీలకు కొదవేముంది? భూములు ప్రభుత్వమే సేకరించి అడిగిందే తడవుగా 21 రోజులలో ఏకగవాక్ష పద్ధతిలో అన్నిరకాల అనుమతులతోసహా అందిస్తూవున్న విషయం మన కళ్ళముందున్నదే! ఇక, ప్రత్యేక ఆర్థికమండళ్ళు, ఎగుమతి ఆధారిత ఆర్థిక మండళ్ళు తదితర పేర్లతో భూములు కేటాయించిన పారిశ్రామికవేత్తలకు దశాబ్దాల తరబడి అనేక పన్నుల మినహాయింపులే గాక, కార్మికులకున్న కనీసపాటి హక్కులను కూడా ప్రశ్నించనీయకుండా మన దేశంలోనే 'విదేశీ భూభాగాలు'గా తమ స్వీయ చట్టాలను అమలు చేసుకొనే, తమ స్వీయ బలగాలను నియమించుకొనే స్వేచ్ఛను ఈపాటికే కట్టబెట్టారు! కార్మికుల శ్రమశక్తిని కారుచౌకగా కొల్లగొట్టుకెళ్ళే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ వంటి విధానాలను నిరాటంకంగా ఇప్పటికే వీరు తమ పరిశ్రమల్లో అమలుచేస్తూనే వున్నారుకదా! ఇంతేగాక, లక్షల కోట్ల రూపాయలు బ్యాంకులవద్ద అప్పు తీసుకొని, వాటిని చెల్లించకుండా ఎగవేస్తూ, పారుబాకీల క్రింద వాటిని రద్దుచేయించు కుంటున్న బడా పారిశ్రామికవేత్తలకంటే సమాజంలో అత్యధిక రాయితీలు, మినహాయింపులు పొందుతున్నవారెవరున్నారు? రాజుగారి వంటిమీద బట్టలు లేకపోవటం కనిపిస్తున్నా ఆయన ధరించిన వస్త్రాలు బ్రహ్మాండమని చుట్టూ చేరినవారు వంత పాడినట్లుగానే ప్రత్యేకహోదా అంశంపై పార్టీలన్నింటి తీరువుందని 5-9-2015 సంచికలోనే 'జనశక్తి' వ్యాఖ్యానించింది.

వాస్తవానికి రాష్ట్రంలో రైతాంగం, కార్మికులు, కష్టజీవుల పరిస్థితి ఎంతో ఘోరంగా వుంది. ప్రభుత్వ ప్రాధాన్యతా క్రమంలో ఆర్భాటాలు చోటుచేసుకొని, ప్రజా సమస్యలన్నీ ప్రక్కకు పెట్టబడు తున్నాయి. ఏపుగా పెరుగుతూ, పంటలు బాగుంటాయని ఆశిస్తున్న తరుణంలో భారీవర్షాలు ఆ ఆశలను అడియాశలు చేశాయి. లక్షలాది ఎకరాలలో పంటలు నీటమునిగి పోయాయి. ఇప్పటికే పెట్టిన పెట్టుబడేకాక, కౌలురైతులు ముందుగా చెల్లించిన కౌలు కూడా నష్టపోయి దిక్కుతోచని స్థితిలో వున్నారు. రుణభారాలు పెరిగి పోయి ఆత్మహత్యల వార్తలు ఇప్పటికే చోటుచేసు కుంటున్నాయి. గ్రామీణ వ్యవసాయకూలీలు, పట్టణాల్లో కష్టజీవులకు ఉపాధి కొరత, వేతనాల సమస్యలతో, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో పూట గడవటం కష్టమౌతున్నది. చుట్టు ముట్టున్న వైరల్ జ్వరాలు, అనారోగ్యాల బారిన పడిన కుటుంబాలకు కనీస వైద్యం కరువైన దుస్థితిని ఎదుర్కొంటున్నారు. వాస్తవంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఈ తక్షణ సమస్యలుగానీ, భూమి ఇతర ప్రజల మౌలిక సమస్యలేవీగానీ పాలక, ప్రతిపక్ష పార్టీలకు పట్టలేదు.

ఏదో ఒక అంశాన్ని సాకుగా చేసుకొని నిరంతరం వాస్తవ ప్రజల జీవన సమస్యల నుండి, వాటిని పరిష్కారం చేయాల్సిన తమ బాధ్యత నుండి పాలకులు తప్పుకుని, అప్రధానమైన లేదా ప్రక్కదోవ పట్టించే మరో అంశంపైకి ప్రజల ఆలోచనను మళ్ళించే కుటిల విధానాలను వ్యతిరేకిస్తూ, ప్రజలను వారి నిజజీవిత సమస్యలపై సంఘటిత పర్చటమే మన ముందున్న ఏకైక కర్తవ్యం మరియు పరిష్కారమార్గం.

oooooo